క్లుప్తంగా

నేడు మున్సిపల్ బడ్జెట్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ బడ్జెట్ సమావేశం సోమవారం సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంకుషావలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 సవరణ బడ్జెట్‌తో పాటు 2023–24 సాధారణ బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



2008 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పాల్వంచరూరల్: పెద్దమ్మ గుడి వద్ద ఫంక్షన్ హాల్లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 సంవత్సరాల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అశోక్, సత్య, ప్రసాద్, వీరన్న, ప్రదీప్, అబ్దుల్లా, సంపత్, జోషి, నానిశ్రీ, విజయకుమారి, నవ్య, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను పరిరక్షించుకుందాం



డైరీ ఆవిష్కరిస్తున్న ఏటీఎఫ్ నాయకులు

ఇల్లెందురూరల్: ఆదివాసీ ఉపాధ్యాయులు, జాతి హక్కులను పరిరక్షించుకుందామని టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాస్, కబ్బాకుల రవి అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో టీఎస్ ఏటీఎఫ్ 2023 డైరీని ఆదివారం వారు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఆదివాసీ ఉపాధ్యాయులు సంఘ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి జీఓ నంబర్ 3కి చట్టబద్ధత కల్పించేలా తీర్మానం చేసి గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఏజెన్సీ ఆదివాసీ ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్సం అంజయ్య, ఉండం నాగేందర్, పాయం ఆనందరావు, చాపల రమేష్, మోకాళ్ల కృష్ణార్జున్, కొడెం కృష్ణ, కల్తి భాస్కర్, అరెం రవికుమార్, కుంజ రామారావు, తోలెం ఈశ్వర్, బొల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం



ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గాలివానకు ఇంటి పైకప్పు లేచిపోయిన దృశ్యం

పాల్వంచరూరల్: గాలివాన పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. మండలంలో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కురిసిన గాలివానకు పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు కూలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామంలో 20 ఇళ్లకు పైకప్పు రేకులు కూలిపోగా, రేగులగూడెంలో మరో పది ఇళ్ల పైకప్పులు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మిర్చి పంట తడిసిపోగా, నాగారంలో జలగం అనిల్‌కు చెందిన పొగాకు బేరడు నేలమట్టమైంది.

వర్షానికి ఇళ్లు ధ్వంసం



ఇంట్లో చెల్లాచెదురు అయిన సామగ్రి

కొత్తగూడెంరూరల్: అకాల వర్షాలకు ఆదివారం మండలంలో పలు నివాసాలు ధ్వంసం అయ్యాయి. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చెలక పంచాయతీ తిప్పగుట్ట, లక్ష్మీపురం గ్రామాలలో గాలిదుమ్ము, భారీ వర్షానికి దాదాపు 30 ఇళ్ల రేకులు కొట్టుకుపోగా, సిమెంటు రేకులు పగిలిపోయాయి. మరికొన్ని చోట్ల ఇళ్లలో ఉంచిన పత్తి బస్తాలు తడిపోయాయి. సమాచారం అందుకున్న జెడ్పీటీసీ వసంత, రేకులు కూలిన ఇళ్ల వద్దకు చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తానని అధైర్యపడవద్దని చెప్పారు.

త్వరలో.. జీపీలకు పక్కా భవనాలు

- మండలంలో 11 గ్రామాలకు నిధులు మంజూరు
- ఉపాధి హామీలో ఒక్కో భవనానికి రూ.20 లక్షలు



స్థలం లేక నిమ్మలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న గ్రామసభ (ఫైల్)

సుజాతనగర్: పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన కొత్త గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు పక్కా భవనాలు లేకపోవడంతో ఆయా పాలకవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన పంచాయతీ కార్యాలయాలు లేక పాలన కొనసాగించడంతో పాటు సేవలు అందించలేని పరిస్థితి. కొన్నిచోట్ల అద్దె భవనాలు, మరికొన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని గదుల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పంచాయతీ కార్యాలయ భవనాలు ఏళ్లక్రితం నిర్మించినవి కావడంతో అవి శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆయా గ్రామాల సర్పంచులు తమ గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు కావాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామపంచాయతీ భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించింది. పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పని ఇబ్బందులు..

గ్రామ పంచాయతీలకు సంబంధించి సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నా చాలా ఇబ్బందులు పడేవారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయాల్లో సభలు, సమావేశాలు నిర్వహించే పరిస్థితి ఉండటంతో అటు విద్యార్థులకు కూడా ఇబ్బందిగానే మారింది. పాఠశాలకు ఉన్న రెండు గదుల్లో ఒక గదిని పంచాయతీ కార్యాలయానికి కేటాయించడంతో మిగిలిన ఒక్క గదిలోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి.

మండలంలో సగానికి పైగా...

సుజాతనగర్ మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. సుజాతనగర్, సీతంపేట బంజర, గరీబ్‌పేట, సర్వారం, సింగభూపాలెం, రాఘవాపురం, నరసింహాసాగర్ గ్రామాల్లోనే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 13 గ్రామాల్లో సొంత భవనాలు లేవు. పాఠశాలలు, అద్దె భవనాల్లో పంచాయతీ కార్యాలయాలను సర్దుబాటు చేశారు. సమావేశాలను పాఠశాలల్లో ఆరుబయటే నిర్వహించుకుంటున్నారు. పంచాయతీ సామగ్రి ఓ మూలకు, సర్పంచ్, వార్డు సభ్యులు కుర్చీలు మరోపక్క వేసుకొని పాలన కొనసాగిస్తున్నారు. రికార్డులు భద్రం చేసుకునేందుకు సరైన సౌకర్యాలు వాటి నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారింది.

ఒక్కో భవనానికి రూ.20 లక్షలు...

మండలంలో 13 గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు కావాల్సి ఉండగా జామ్లాతండా, బేతంపూడి, కోయగూడెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, మాలబంజర, 2ఇంక్‌లైన్, కోమటిపల్లి, నాయకులగూడెం, నిమ్మలగూడెం, సీతంపేట ఈ 11 గ్రామాలకు పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. వీటిలో ఐదు గ్రామ పంచాయతీలకు ఎస్టీఎస్‌డీఎఫ్ (షెడ్యూల్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధులు) నిధులు మంజూరు కాగా... మిగిలిన ఆరు పంచాయతీలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) నిధులు మంజూరయ్యాయి. కొత్త పంచాయతీ భవనాలు నిర్మించుకునేందుకు ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులు కేటాయించారు. దీంతో నూతన భవనాలు పూర్తయితే గ్రామస్తులకు అన్నిరకాల సేవలు అందుబాటులోకి వస్తాయి. మంగపేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో కూడా కొత్త భవనాలు మంజూరు కావాల్సి ఉండగా ఇవి ప్రస్తుతానికి మంజూరు కాలేదు. ఈ రెండు గ్రామాలకు కూడా నూతన భవనాలు అవసరమనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు తెలిపారు.



అద్దె భవనంలో కోమటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

చాలా ఇబ్బంది పడుతున్నాం



గ్రామ పంచాయతీకి సొంత భవనం లేక అద్దె భవనంలో నడిపిస్తున్నాం. సాధారణ సమావేశాలు, గ్రామసభలు నిర్వహిస్తున్న సమయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. చాలాసార్లు మా ఇబ్బందులను పైఅధికారులకు విన్నవించాం.

– మండె నాగరాజేశ్వరి, సర్పంచ్, నాయకులగూడెం

తక్షణమే నిర్మించాలి



గ్రామాలకు సొంతభవనాలు మంజూరు చేయడం శుభపరిణామం. కానీ తక్షణమే వీటి నిర్మాణాన్ని చేపట్టి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఇప్పుడు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు ఇబ్బంది పడుతున్నాం.

– బండి రమేష్, సర్పంచ్, నిమ్మలగూడెం

నిధులు మంజూరయ్యాయి



ప్రస్తుతం 11 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. మంగపేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు కూడా భవనాలు కావాలని ప్రతిపాదనలు పంపాం. ఇవి కూడా మంజూరవుతాయి. పాలనా సౌలభ్యం కోసం ఉండేలా భవనాలను నిర్మించుకోవాలి.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్

హక్కుల కోసం పోరాడుదాం..

ఇల్లెందు: ప్రభుత్వం వికలాంగుల అవసరాలకు అనుగుణంగా పునరావాస చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం (ఎన్పీఆర్డీ) అధ్యక్షుడు ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మొయిన్‌రోడ్ హైస్కూల్‌లో మండల, పట్టణ వికలాంగుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. వికలాంగుల జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ఆ వర్గానికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధుల మీద ఉందన్నారు. ప్రతిఒక్కరూ వికలాంగులను చేరదీసి, వారికి సమాజంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఉద్యోగాలు, విద్య, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తే అందరితో సమానంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్, రాజేందర్, రాంచందర్, లోథ్ రాంలావన్, కిషోర్, రవి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి నవభారత్‌కు చెందిన పర్వతనేని రమేష్, నిర్మల రూ.1,01,116, బాపూజీనగర్‌కు చెందిన పద్మ, మసాల నర్సింహారావు జ్ఞాపకార్థం రూ.5,116 అందజేసినట్లు ఆలయ ఈఓ రజనీకుమారి ఆ దివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందించినట్లు పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఇల్లెందురూరల్: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండలంలో వానాకాలం కంటే యాసంగిలోనే మొక్కజొన్న పంట అధిక విస్తీర్ణంలో సాగువుతోందని, ప్రస్తుతం కోత దశలో ఉన్న మొక్కజొన్న భారీ వర్షంతో పూర్తిగా నేలవాలిందని చెప్పారు. మిర్చి, కూరగాయలు, మామిడితోటలకు కూడా తీరని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం సంబంధిత అధికారులతో సర్వే చేయించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

చుంచుపల్లి: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో టీఎస్ పీఎస్సీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను తొలగించి కేసును సీబీఐకి లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మండలంలోని పెనుబల్లి గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. లీకేజీ విషయంలో సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని, రాజకీయ నేతలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్లుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీకి సంబంధించి విచారణ జరుగుతుండగా కేటీఆర్ ఈ కేసులో దోషులు ఇద్దరే అని ఎట్లా తేల్చారని, విచారణ అధికారులను ప్రభావితం చేసేందుకే కేటీఆర్ ఇలా అంటున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెబ్బా కృష్ణ, సురేష్, చెర్రీ, సందీప్, కనకయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతులు ఆగమాగం

ఇల్లెందురూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రైతులకు తీరని నష్టం వాటిల్లింది. మొదటి రోజు వర్షానికి చెదురుమదురుగా నేలవాలిన మొక్కజొన్న రెండో రోజు ఆదివారం కురిసిన భారీ వర్షానికి అత్యధిక విస్తీర్ణంలో పంటలు నేలవాలాయి. మొక్కజొన్నతోపాటు పొద్దుతిరుగుడు, మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది అరకొరగా పూతతో నష్టాల బాటలో ఉన్న మామిడి రైతుకు భారీ వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. మామిడికాయలు రాలిపోయాయి. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయశాఖ ఏఓ సతీష్ ఆదివారం పలు గ్రామాలలో పర్యటించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి మొక్కజొన్న, మిర్చి, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఏఓ మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా మండల వ్యాప్తంగా సుమారుగా 480 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగినట్లు చెప్పారు.



ఇల్లెందురూరల్: మాణిక్యారంలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఏఓ సతీష్

పంటలకు నష్టపరిహారం అందించాలి...

జూలూరుపాడు: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో అకాల వర్షాలతో కల్లాల్లో తడిసిన మిర్చి పంటను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతుంటే నష్టపోయిన పంటలపై మంత్రివర్గంతో సమీక్షించకుండా బిడ్డ కవిత కోసం కేసీఆర్ మంత్రులను ఢిల్లీ పంపే పనిలో ఉన్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం రాకుండా పోయిందన్నారు.

భారీ వర్షం... బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో జూలూరుపాడు మండలంలో శనివారం సాయంత్రం నుంచి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో కల్లాల్లోని మిర్చి పంట తడిసింది. జూలూరుపాడు, సురారం, అనంతారం, గాంధీనగర్ తదితర గ్రామాల్లోని పలువురు రైతుల మిర్చి కల్లాల్లోకి వరద నీరు చేరడంతోపాటు, పట్టాలు కప్పినప్పటికీ తడిసిపోయాయి. అదేవిధంగా వెంగన్నపాలెం, జూలూరుపాడు, సాయిరాంతండా గ్రామాల్లో అక్కడక్కడ మొక్కజొన్న నేల వాలింది. నాలుగు రోజులుగా మోస్తరు వాన కురుస్తుండటంతో అప్రమత్తమైన రైతులు కల్లాల్లోని మిర్చి తడిసి పోకుండా పట్టాలు కప్పి జాగ్రత్త పడటంతో ఆదివారం కురిసిన భారీ వర్షానికి నష్ట తీవ్రత తక్కువగా ఉంది.

ఇల్లెందురూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఆయన పంటలను పరిశీలించారు. మాట్లాడుతూ.. భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో మొక్కజొన్న, మిర్చి, పొద్దుతిరుగుడు పంటకు నష్టం వాటిల్లిందని చెప్పారు. మామిడితోటల్లో కాయలు రాలిపోయాయన్నారు. భారీగా పెట్టుబడులు పెట్టి పంట చేతికందే దశలో ఉండగా జరిగిన నష్టం రైతులను కోలుకోలేని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనలతో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతిరైతుకూ పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు, వాంకుడోత్ సరోజిని, తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, మోతీలాల్ పాల్గొన్నారు.







జూలూరుపాడులో మిర్చి కల్లాల్లోకి చేరిన వర్షపు నీరు, తడిసిన మిర్చి పంటను పరిశీలిస్తున్న నాయకులు, ఇల్లెందురూరల్: పంటను పరిశీలిస్తున్న నాయకులు

సత్యనారాయణపురంలో ఆధ్యాత్మిక శోభ



బోనం సమర్పించేందుకు వస్తున్న గ్రామప్రజలు



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

పాల్వంచరూరల్: సత్యనారాయణపురంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో మూడు రోజులపాటు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గ్రామంలో వేదమంత్రోచ్ఛరణలతో ఘనంగా బొడ్రాయిని పునఃప్రతిష్ఠించారు. రాత్రి నుంచి ఉదయం వరకు గ్రామంలోకి వచ్చే రహదారులను అష్టదిగ్బంధనం చేసి గ్రామ పొలిమేరల్లో బలిముద్ద వేశారు. గ్రామంలోని ప్రజలు ఇంటింటి నుంచి బోనాలు సమర్పించారు. మహిళలు భక్తితో నృత్యాలు, శివసత్తుల పూనకాలతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడింది.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ



టేకులపల్లి: హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. ఈ మేరకు ఆదివారం ఇల్లెందు, టేకులపల్లి క్యాంపు కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ట పర్చాలని కోరారు. సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేశారని, ప్రభుత్వ పథకాలు అందుతున్న వారిని కలిసి గుర్తుచేయాలని, ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, మండల బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, కంభంపాటి చంద్రశేఖర్, బాణోతు రామ, మౌలానా, కిషన్, శివకృష్ణ, లక్కినేని శ్యామ్, బాలకృష్ణ, ఉండేటి బసవయ్య సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజేఎస్ అధ్యక్షుడిగా రామ్మూర్తి

టేకులపల్లి: తెలంగాణ జన సమితి (టీజేఎస్) లో పలువురు చేరారు. ఈ మేరకు ఆదివారం పెట్రాంచెలక స్టేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజేఎస్ ఇల్లెందు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుగులోత్ భద్రు నాయక్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారితో గ్రామ పంచాయతీ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా జాటోతు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా బాణోతు చందా, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తేజావత్ మాన్‌సింగ్, భూక్యా రాంబాబు, సక్రు, మంగీలాల్, వెంకటేశ్వర్లు, రవీందర్, బద్రియా, మంగ్యా, యాదగిరి, భిక్షం, మంగమ్మ, భావ్‌సింగ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో భద్రునాయక్

తండ్రీకొడుకులు రాజీనామా చేయాలి



పాల్వంచ: కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇల్లెందు: ఆందోళన చేస్తున్న నాయకులు

పాల్వంచ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీకి కారణమైన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు రాజీనామా చేయాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. కేటీఆర్ నీకు సంబంధం లేనప్పుడు విద్యాశాఖ మంత్రితో మాట్లాడించాల్సింది పోయి మీరెందుకు మీడియా ముందుకు వచ్చారని ప్రశ్నించారు. ఇంటర్ ప్రశ్నపత్రం లీకేజీ, ఇంటర్ బోర్డ్ తప్పిదాలు, సింగరేణి పరీక్షల్లో అవకతవకలు అన్ని మీ కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీలో కేటీఆర్ పీఏ హస్తం ఉందని, దీనిపై ఉన్నత స్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. లిక్కర్ కుంభకోణంలో కూతురిని కాపాడుకునేందుకు రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నూకల రంగారావు, బొమ్మిడి మల్లికార్జున్, జలీల్, చారి, మనోహర్ రావు, వీరయ్య చౌదరి, బద్ది కిశోర్, కొండెం వెంకన్న, భూక్యా రాములు, రాము నాయక్, సత్యనారాయణ, వెంకట్, వానపాకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో బాధ్యత వహించి కేటీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో మాళోత్ మంగీలాల్ నాయక్, నున్నా కృష్ణయ్య, బానోత్ నవీన్ రాథోడ్, వాంకుడోత్ కిషన్ నాయక్, కొలిపాక శ్రీనివాసరావు, గోసు రామారావు, గుగులోత్ శ్రీనివాసరావు, ఎస్కే ముస్తాఫా, బానోత్ మంగూ నాయక్, బాదావత్ సొమ్యా నాయక్, కొమ్ము రవి, గుగులోత్ బాలాజీ, ఆదినారాయణ, పోగుల శ్రీను, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ సంఘటనకు మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. టీపీసీసీ పిలుపు మేరకు పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లెందు పాత బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు దానియేల్ మాట్లాడారు. కార్యక్రమంలో సైదయ్య, లింగాల జగన్నాథం, మహబూబ్, ఆవుదుర్తి శంకర్, ఆర్.జగన్నాథం, తోట వెంకటేశ్వర్లు, సుమిత్ కోరీ, వాసుదేవ్, ఎండీ ఇబ్రహీం, కంచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా దేవా నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో వీసం శ్రీనివాస్‌రావు, రాసమల్ల నర్సయ్య, లక్‌పతి, భీముడు, దేవరాజు, రవీందర్‌సింగ్, బస్సీలాల్, అర్జున్, రెడ్డి, ధర్మానాయక్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగు కంపుతో అవస్థలు..

టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ లచ్చతండా అంగన్‌వాడీ కేంద్రం పక్కనే మురుగునీరు అధ్వానంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో చుట్టుపక్కల నివాసాల్లోని మురుగు అంగన్‌వాడీ కేంద్రం పక్కనే నిల్వ ఉంటోంది. ఎలాంటి నివారణ చర్యలు లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : శరత్‌చంద్ర, కార్యదర్శి, దాసుతండా పంచాయతీ
సెల్ నంబర్ : 9908504480